RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

| Malkajgiri | Volume: 4 | Issue: 22 | Friday, June 12, 2026 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 4 | సంచిక : 22 | శుక్రవారం, జూన్ 12, 2026 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /- |


విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

## పీఓకేలో మళ్లీ పోలీసుల కాల్పులు..

# 16 మంది మృతి..!

**న్యూఢిల్లీ,జూన్, 11:**పాక్ ఆక్రమిత కశ్మీర్ లో గత కొన్ని రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనకారులపై ఇటీవల జరిగిన కాల్పుల ఘటన మరువకముందే, తాజాగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మరో 16 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక నివేదికలు చెబుతున్నాయి. ఈ తాజా మరణాలతో ఈ ప్రాంతంలో గత వారం రోజులుగా జరిగిన ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య 30 దాటినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పీఓకే పరిధిలోని ప్రధాన నగరాల్లో కర్ఫ్యూ విధించడంతో పాటు మొబైల్, ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నేతృత్వంలో ఈ నిరసనలు ఉధృతంగా సాగుతున్నాయి.

పీఓకేలో విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ బిల్లులపై సబ్సిడీలు ఇవ్వాలని ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.దీనికి తోడు జూలైలో జరగబోయే ప్రాంతీయ ఎన్నికల్లో శరణార్థులకోసం12స్థానాలను రిజర్వ్ చేయాలనే పాక్ ప్రభుత్వ నిర్ణయాన్నివ్య తిరేకిస్తూ స్థానిక ట్రేడర్స్, సివిల్ సొసైటీ గ్రూపులు తిరుగుబావుటా ఎగురవేశాయి. పరిస్థితి చేదాటిపోతుండటంతో పాక్ అనుకూల స్థానిక ప్రభుత్వం జాయింట్ అవామీ యాక్షన్ కమిటీని ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధిత సంస్థగా ప్రకటించింది. అంతేకా కుండా



ఆందోళనలను అణచి వేయడానికి పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం భారీగా పారామిలిటరీ బలగాలను పీఓకేకు తరలించింది. రావలకోట్, ముజఫరాబాద్ వంటి నగరాల్లో ని రసనకారుల ర్యాలీలపై భద్రతా బలగాలు లైవ్ రౌండ్ల కాల్పులు, లాఠీఛార్జ్ మరియు టియర్ గ్యాస్ ప్రయోగించడంతో రణరంగంగా మారింది.

## మోడీ అధ్యక్షతన నీతి ఆయోగ్ భేటీ..

# వికసిత్ భారత్‌పై ఫోకస్




ప్రధాని మోడీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేశాభివృద్ధి, సమగ్ర మానవ వనరుల పురోగతి, 2047నాటికి అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనపై కీలకంగా చర్చించారు. వికసిత్ భారత్ లక్ష్యం నీతి ఆయోగ్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం... ఈ ఏడాది సమావేశం ప్రధాన అంశం "విక్షిత్ భారత్-2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి". వయస్సు, ప్రాంతం, లింగం, సామాజిక-ఆర్థిక నేపథ్యం వంటి భేదాలు లేకుండా ప్రతి పౌరుడి సం క్షేమాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దేశంలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృ ద్ధిని బలోపేతం చేయడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను విస్తరించడంపైచర్చించారు. సమగ్ర మానవ అభివృద్ధి కోసం రూపొందించిన కార్యాచరణ నాలుగు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉందని నీతి ఆయోగ్ తెలిపింది. మానవ వనరుల అభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు-ఉత్పాదక ఉపాధి, వ్యవస్థాపకత, వికేంద్రీకృత అభివృద్ధి-ఆరోగ్యం, పోషకాహారం, సమగ్ర సంక్షేమం-అందరికీ సమాన అవకాశాలు, గౌరవప్రద జీవనం-డిజిటల్ మౌలిక సదుపాయాలపై దృష్టి.పాలన వ్యవస్థలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భాగస్వామ్యాలు, డేటా ఆధారిత విధానాల ద్వారా అమలు ప్రణాళికను రూపొందించడంపై కూడాచర్చ జరిగింది. స్వల్ప,మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనను పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి ప్రణాళికలను జాతీయ అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేయడం, సమన్వయంతో ముందుకు సాగడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. అలాగే 2025 డిసెంబర్‌లో జరిగిన 5వ జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సులో వచ్చిన సిఫార్సులను కూడా సమావేశంలో సమీక్షించారు. ప్రాథమిక విద్య, పాఠశాల విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, క్రీడలు, పాఠ్యేతర కార్యక్రమాల అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చలు జరిగినట్లు నీతి ఆయోగ్ వెల్లడించింది.

# పనిచేయని సీఎంకు ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకు?: హరీశ్ రావు

హైదరాబాద్, జూన్11: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిగా దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరించడం వెనుక రాష్ట్రంలోని ఆపార్టీ నేత హస్తం ఉందని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఆమెకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఉన్నట్లు తెలంగాణ నుంచే తమకు సమాచారం అందిందని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రే చెప్పారని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ కేసును బీజేపీ మంత్రికి లీక్ చేసింది ఎవరని.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మీనాక్షినటరాజన్ కేసును లీక్ చేసింది ఎవరనే దానిపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్), జ్యుడీషియరీ ఎంక్వైరీ వేస్తావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చెప్పిన వ్యక్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వలేదని విమర్శించారు. అందుకే ఆ వ్యక్తి మధ్యప్రదేశ్ మంత్రికి సమాచారం ఇచ్చారని తెలిపారు. దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి అనుచరుడు ఉన్నారని చెప్పారు. రూ.100 కోట్లతో తన నివాసం



సమీపంలోబోధి పెవిలియన్ పేరుతోసీఎం రేవంత్ రెడ్డి నివాసం నిర్మిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఈ ఇంటి నిర్మాణం కోసం పదుల సార్లు సీఎం అక్కడికి వెళ్లారని చెప్పారు.

# ఒమన్ తీరం వద్ద అమెరికా దాడి..

న్యూఢిల్లీ:అమెరికా వైమానిక దాడిలో భారత్‌కు చెందిన ముగ్గురు నావికులు మృతిచెందారు. వాస్తవానికి గత వారం జరిగిన ఆ ఘటనలో ఆ నావికులు మిస్సైనట్లు భావించారు. కానీఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ఆ ముగ్గురు నౌకాదళ సిబ్బంది మృతిచెందినట్లు షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఎంటీ సిట్టిబెల్లో అనేనౌకలో మొత్తం 28మంది సిబ్బంది ఉన్నారు. దీంట్లో 24 మందిభారతీయులే. విదేశీయుల్లో ఇద్దరు పాకిస్తానీలు,ఒకరు ఉక్రెయిన్ , రష్యా వ్యక్తి ఉన్నారు.గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఆ నౌకపై అమెరికా దాడి చేసింది. మృతిచెందిన వారిని డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ,ఇంజిన్ ఫిట్టర్ శివానంద చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాలా సురేశ్‌గా గుర్తించారు. ఒమన్‌తీరంలో వెళ్తున్న నౌకపై ప్రిసిషన్ మునిషన్ బాంబులతో సెంట్రల్ కమాండ్



దళాలు అటాక్ చేశాయి. ఇరాన్ సంక్షోభ వేళ ఆ నౌక ఆదేశాలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి.అయితే ఐక్యరాజ్యసమితి వేదికగా ఆ దాడిని ఇండియా ఖండించింది. 24 మంది భారతీయులున్న నౌకపై అమెరికా నేవీ దాడి చేసిందన్నారు. హోర్ముజ్‌ను క్రాస్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు.

# ప్రధానితో సీఎం రేవంత్ కీలక భేటీ

## మెట్రోకు నిధులు, 'పాలమూరు' క్లియరెన్స్‌పై చర్చ

**న్యూఢిల్లీ,జూన్, 11:**దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో విడిగా భేటీ అయ్యారు. అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక, సాంకేతిక సహకారంపై ఇరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రవాణా రంగానికి, పారిశ్రామిక వృద్ధికి ఊతమిచ్చే రీజినల్ రింగ్‌రోడ్డు పనుల పురోగతిని సీఎం రేవంత్ ప్రధానికి వివరించినట్లుగా తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అవసరమైన కేంద్ర నిధులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. దీంతో పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం డీప్ వాటర్ పోర్టు వరకు ప్రతిపాదించిన అత్యంత కీలకమైన 12 లేన్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

గ్రేటర్‌హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు సిద్ధం చేసినహైదరాబాద్ మెట్రోరైల్ ఫేజ్ పనులకు కేంద్ర వాటాను,అవసరమైన నిధుల



ను మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. అలాగే, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాలని పీఎంకు రిక్వెస్ట్ చేశారు.దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని అయిన జైపాల్ రెడ్డి పాలమూ రు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కేంద్ర జల సంఘం నుంచి త్వరగా క్లియరెన్స్ ఇప్పించాలని రేవంత్ రెడ్డి, పీఎం మోడీని కోరినట్లుగా తెలుస్తోంది.

## ఆ వార్తల్లో నిజం లేదు..

# టీఎంసీ విలీనంపై కాంగ్రెస్ క్లారిటీ..!



**న్యూఢిల్లీ,జూన్, 11:**తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం కానుందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అలాంటి చర్చలు ఎక్కడా జరగలేదని స్పష్టంచేసింది. ఈ వార్తలన్నీ పూర్తిగా నిరాధారమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కొట్టిపారేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ,టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాతే రెండు పార్టీల విలీనంపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ సమావేశంలో జాతీయ రాజకీయ అంశాలపై మాత్రమే చర్చ జరిగిందని వేణుగోపాల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలను మరింత సమర్థంగా ఎలా లేవనెత్తాలనే అంశంపైనే చర్చ జరిగిందన్నారు.

విలీన ప్రతిపాదనగానీ, అలాంటి చర్చలుగానీ అస్సలు జరగలేదని స్పష్టం చేశారు.పశ్చిమబెంగాల్‌లో ఇటీవలటీఎంసీ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొ ంటోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో అసమ్మతి పెరిగింద న్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌తో టీఎంసీ విలీనం కావచ్చన్న ప్రచారం ఊపందుకుంది. ఇదే అంశంపై టీఎంసీ ఎంపీ సౌగతరాయ్ కూడా స్పందించారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం అవసర మని చెప్పారు. అయితే అది కూటమి రూపంలో ఉంటుందా..? విలీనం రూపంలో ఉంటుందా..? అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. మరోవైపు విలీనంపై టీఎంసీ అధిష్ఠానం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి

# భద్రతే లక్ష్యం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 11: ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(గురువారం) జలసౌధలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ఖమ్మం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు, పాత ఆయకట్టుకు స్థిరీకరణ చేస్తామన్నారు. మున్నేరు - పాలేరు అనుసంధానం.. ఖమ్మం, సూర్యాపేట రైతులకు వరమన్నారు. విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటిని మళ్లించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని.. ప్రతి ప్రాజెక్టుకు



గడువులు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# నిరసనకారులపై బుల్లెట్ల వర్షం, తీవ్ర ఉద్రిక్తత

ఆఫ్ఘనిస్తాన్లోని హెరాత్ ప్రావిన్స్ కాల్పుల మోతతో అట్టుడికింది. బుధవారం ఉదయం హెరాత్‌లోని జిబ్రిల్ ప్రాంతంలో, సరైన బురఖా ధరించలేదనే ఆరోపణలతో మహిళలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ వీధుల్లోకి వచ్చిన నిరసనకారులపై తాలిబాన్లు విరుచుకుపడ్డారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించగా, దాదాపు ముప్పై మంది గాయపడ్డారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

ఉదయం 8 గంటల ప్రాంతంలో హెరాత్‌లోని జిబ్రిల్ వాసులు మహిళల అరెస్టులకు వ్యతిరేకంగా ఉద్యమించారు. వీరిని అణచి వేసేందుకు తాలిబాన్ ఫైటర్లు తూపాకీలను నేరుగా ఛాతీపై గురిపెట్టి కాల్పులు జరిపారని, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఈ ఘటన మానవ హక్కుల సంఘాలు, తాలిబాన్ వ్యతిరేక రాజకీయ నేతలలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. నగరంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. మహిళల రాకపోకలపై ఆంక్షలు, నిర్బంధాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

తమ మహిళలను బయటకు వెళ్లనివ్వవద్దని, ఒకవేళ వారిని బంధిస్తే విడిపించడానికి తాము ఎలాంటి మధ్యవర్తిత్వం వహించలేమని హెరాత్‌లో ని కొందరు మసీదు ఇమామ్‌లు నిన్న ప్రజలను హెచ్చరించారు. తాలిబాన్లు నిరసనకారుల ఛాతీపై కూడా కాల్పులు జరిపారనీ, కొందరు యువకులు కిందపడి రక్తం ఓడుతుండటం చూశానని స్థానికులు ఒకరు తెలిపారు.

మహిళలు నినాదాలు చేస్తుండగా, తాలిబాన్లు కాల్పులు జరుపుతున్నారు. తాలిబాన్ల నిబంధనల ప్రకారం బురఖా/హిజాబ్ ధరించని మహిళలను నగరంలోని అన్ని ప్రాంతాల్లో అరెస్ట్ చేస్తున్నారు. అయితే వారు భారీగా కాల్పులు జరుపుతున్నప్పటికీ, ప్రజలు "విద్య, ఉపాధి, స్వేచ్ఛ" అంటూ నినాదాలు చేస్తున్నట్లు వీడియోలలో కనిపిస్తోంది.

తెలంగాణ షాన్

## సంపాదకీయం


### యూరియాపై పశ్చిమాసియా ప్రభావం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరిస్థితులు అనూహ్యంగా ఉంటున్నాయి. మార్చి 10 నాటికి భారత్‌లో యూరియా నిల్వలు 61.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని, అంటే గత ఏడాది ఇదే సమయంలో ఉండే నిల్వల కన్నా 10 లక్షల టన్నుల వరకు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేస్తోం ది. ఈ సంక్షోభం వ్యవసాయానికి ప్రధాన అవసరమైన యూరియా తయారీకి కావలసిన లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ద్రవీకృత సహజవాయువుఎల్‌ఎన్‌జి) సరపరాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. యుద్ధం ప్రకంపనలు ఇప్పటికే భారత్ యూరియా సరఫరాను దెబ్బతీస్తున్నాయి. ఆదివారం (మార్చి 22) నాటికి భారత్ లోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ అతిపెద్ద ఎల్‌ఎన్‌జి దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జి సంస్థ ఖతార్ నుండి దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా గ్యాస్ సరఫరాను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. ఇటీవల ఖతార్‌లోని రాస్‌లాఫాన్‌లో యుద్ధంవల్ల గ్యాస్ సరఫరా వ్యవస్థకు నష్టం జరగడంతో ఒప్పందం ప్రకారం సరఫరా చేయలేనని పెట్రోనెట్ చేతులుఎత్తేసింది. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని గెయిల్ (ఇండియా), ఇండియా ఆయిల్ కార్పొరేషన్ సంస్థ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి గ్యాస్ పంపిణీదారుల ద్వారా సరఫరా కోతకు దారి తీసింది. ఎల్‌ఎన్‌జి సరఫరా కోసం భారత్ భారీగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ రోజూ 4.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, అంటే తన అవసరాల్లో 88%, అలాగే 47% సహజవాయు డిమాండ్ కోసం ద్రవీకృత సహజవాయువును విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడమే కాకుండా ఎరువులపై భారత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై కూడా ప్రభావంపడే అవకాశం కనిపిస్తోంది. యూరియా కొరతవల్ల వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరగడమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్ నుంచి 50% పైగా సహజవాయువు (ఎల్‌ఎన్‌జి)ను భారత్ దిగుమతి చేసుకుంది.

ప్రపంచం మొత్తంమీద భారీస్థాయిలో ఎల్‌ఎన్‌జి నాలుగో కొనుగోలుదారు భారత్‌యే. 2025లో 261 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్‌ఎన్‌జిని భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 40% ఖతార్ నుంచి మిగతా 20% యుఎఇ, ఒమన్ ద్వారా సరఫరా అవుతుంది. ఈ ఎల్‌ఎన్‌జి అంతా హోర్ముజ్ జలసంధి ద్వారానే నౌకల మీదుగా రవాణా అవుతుంది. మొత్తం మీద భారత్ దిగుమతి చేసుకునే ఎల్‌ఎన్‌జి 60% వరకు హోర్ముజ్ జలసంధి మూసివేయడంవల్ల అంతరాయం ఏర్పడుతోంది. భారత్‌లో అమోనియా తయారీకి తద్వారా ఎరువుల తయారీకి ప్రధానంగా సహజవాయువునే వినియోగిస్తుంటారు. 2026లో భారత్‌కు సరఫరా అయిన ఎల్‌ఎన్‌జిలో 30% ఎరువుల తయారీకే వినియోగం కావడం గమనార్హం. యూరియా ఉత్పత్తికి ఎల్‌ఎన్‌జి ప్రధాన వనరు. దేశంలో ఎరువులుగా యూరియానే ఎక్కువగా వాడుతుంటారు. యూరియా ఉత్పత్తి అత్యంత ఇంధన వినియోగతో కూడిన ప్రక్రియ. ఈ యూరియా ప్లాంట్లు తక్కువ ఉద్గారాలను విడుదల చేసే సహజవాయువు వినియోగంలోకి మారాయి. జాతీయ స్థాయిలో యూరియా వినియోగం గత దశాబ్దకాలంలో క్రమంగా పెరిగి 2025లో 387 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025లో స్వదేశీ యూరియా ఉత్పత్తి కూడా దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జరిగినా దేశం మొత్తం మీద డిమాండ్‌ను నెరవేర్చలేకపోతోంది. అందువల్ల భారత్ యూరియా దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం స్వదేశీ యూరియా ఉత్పత్తిని, సరఫరాను దెబ్బతీస్తోంది. 2025లో భారత్ యూరియా దిగుమతులు 2300 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయి. ఈ దిగుమతుల్లో 71% పశ్చిమాసియా నుంచి రావలసి ఉండగా, ఇందులో 45% ఒమన్, సౌదీఅరేబియా, ఖతార్, యుఎఇ నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ మొత్తం సరఫరా హోర్ముజ్ జలసంధిద్వారా రవాణా కావలసి ఉంది. ఈ నేపథ్యంలో సహజవాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వు 2026ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఎరువుల రంగాన్ని ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రెండు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పుడు కూడా ఇంధనం, ఎరువుల సరఫరా విషయంలో కూడా భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చి స్వదేశీయంగా సబ్సిడీ ధరకు గ్యాస్ లభిస్తేనే ఎరువులు ఉత్పత్తి అవుతాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా పొటాష్ సరఫరా దెబ్బతింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే యూరియాలో 14% ఒక్క రష్యా నుంచే సరఫరా అవుతోంది. డిఎపిలో రష్యా సరఫరా దాదాపు 10% వాటాతో రెండో ఉత్పత్తిదారుగా రష్యా ఉంటోం ది. పొటాష్‌లో కావలసినవి 50% రష్యా, బెలారస్ నుంచే రప్పించుకోక తప్పదు. భారత్ డిఎపి డిమాండ్‌లో దాదాపు 60% చైనా, సౌదీఅరేబియా నుంచే లభిస్తోంది. ఇప్పుడు సౌదీఅరేబియా కూడా యుద్ధ బాధిత దేశంగా ఉండడంతో డిఎపి సరఫరా దెబ్బతింటోంది. భారతదేశానికి సరఫరాలో ఇబ్బందులే కాకుండా దిగుమతుల వ్యయం బిల్లుకూడా అమాంతంగా పెరిగే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని వాణిజ్యవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# మమత ఫెయిల్యూర్ స్టోరీ... ఎందుకిలా... ఏమైంది

**కోల్ కత్తా, జూన్ 11 :** మమతా బెనర్జీ 1985లో పార్లమెంట్ సభ్యురాలిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆమె ఒక మంచి పోరాట యోధురాలు, పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్‌ను అధికారం నుంచి విజయవంతంగా గద్దె దింపారు. ఆమె 2011లో ముఖ్యమంత్రి అయ్యారు, 2016లో తిరిగి ఎన్నికయ్యారు, మళ్ళీ 2021లో కూడా గెలిచారు. అయితే, 2026లో ఘోర పరాజయం తర్వాత, ఆమె పార్టీ, ఆమె వ్యక్తిగత రాజకీయ పలుకుబడి వేగంగా క్షీణించే దశలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. నిజాయితీపరుడు, నిష్కపటమైన వ్యక్తిగా భావించే రాజకీయ నాయకులు అధికారాన్ని కోల్పోయినప్పుడు, తరచుగా ప్రజల సానుభూతి ఉంటుంది. కానీ ఒక రాజకీయ నాయకుడు వివాదాల మధ్య ఓడిపోయి, అధికారంలో ఉన్నప్పుడు అహంకారిగా కనిపించినప్పుడు, ప్రతిస్పందన చాలా భిన్నంగా ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రత్యర్థులు ఆ పతనాన్ని వేడుక చేసుకుంటారు. స్నేహితులు కూడా రహస్యంగా దానిని స్వాగతించవచ్చు. ఈ రోజు మమతా బెనర్జీ విషయంలో ఇదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ప్రత్యర్థులు ఆనందంగా ఉన్నారు, ఆమె మాజీ మిత్రులు చాలామంది కూడా, బహిరంగంగా అంగీకరించకపోయినా, సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. బెంగాల్‌లోని చాలా మంది ఓటర్లు ఆమె నాయకత్వంపై విసిగిపోయారనడంలో సందేహం లేదు. వివాదాస్పదంగా, ఘర్షణపూరితంగా, లేదా అవినీతి, హింసతో సంబంధం ఉన్నట్లు కనిపించే రాజకీయ నాయకుల పట్ల ప్రజలు తరచుగా విముఖత చూపుతారు. మమతా బెనర్జీ తరచుగా అటువంటి వివాదాలను ఆకర్షించారు. అయితే, ముఖ్యమంత్రిగా, ప్రజలు ఆమె నుంచి హుందాతనం, సంయమనం, రాజనీతిజ్ఞతను ఆశించారు. చాలా మంది బెంగాలీలు గౌరవం, ప్రజా ప్రవర్తన వంటి విషయాల పట్ల ప్రత్యేకంగా సున్నితంగా ఉంటారు. చివరికి, వారు బ్యాలెట్ పెట్టె వద్ద ఆమెను శిక్షించారు. మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ప్రోత్సహించి ముఖ్యమైన పదవికి ఆయనే వారసుడు అనే వాతావరణాన్ని సృష్టించారు. దీంతో ఆయన షాడో సీఎంగా మారిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అభిషేక్ బెనర్జీ సమర్థవంతమైన నాయకుడిగా, వినయశీలిగా, ప్రభావవంతమైన వ్యక్తిగా భావించి ఉంటే ఈ వాతావరణాన్ని అందరూ స్వాగతించేవారు. అయితే, చాలా మంది ఓటర్లు ఆయనలో ఈ లక్షణాలు లేవని నమ్మారు. ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేయడానికి కేవలం ఒక అవకాశం కోసం ఎదురుచూశారు. జనాభాలో దాదాపు 32% మైనారిటీలు ఉన్న రాష్ట్రంలో, బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నందున, మమతా బెనర్జీ ఓటమి దాదాపు అసాధ్యమని చాలామంది నమ్మారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న నియోజకవర్గాలలో తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం చెలాయించింది. మెజారిటీ తగ్గినా,



మమత మళ్లీ గెలుస్తారని చాలా మంది పరిశీలకులు అంచనా వేశారు. దానికి బదులుగా, ఒక నాటకీయ పరిణామం జరిగింది. హిందూ సమాజంలోని ఒక వర్గం ఆమెకు, ఆమె రాజకీయ వైఖరికి వ్యతిరేకంగా మారిందని సమాచారం. ఫలితంగా, బీజేపీ 294 స్థానాలకు గాను 207 స్థానాలను గెలుచుకుని భారీ విజయాన్ని సాధించింది. ఇది ఒక అద్భుతం. మమతా బెనర్జీ పరిపాలనకు ఎప్పుడూ తగినంత ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించలేదు. ఆమె ప్రభుత్వం రైల్వేలు, విమానాశ్రయాలు, రోడ్లు, కాలువలకు సంబంధించిన అనేక కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ఆలస్యం చేసిందని లేదా అడ్డుకుందని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా, అనేక కేంద్ర ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలు కాలేదు లేదా ఆలస్యమయ్యాయి. ఫలితంగా, పశ్చిమ బెంగాల్ అభివృద్ధి దెబ్బతిందని చాలా మంది భావించారు. కేవలం రాజకీయాలు చాలు అని మమత అనుకుంటే, ప్రజలు మెరుగైన పాలన కోరుకున్నారు. మమతా బెనర్జీ ఓటమికి ఇలా చాలా కారణాలు ఉన్నాయి. కారణాలు ఏవైనప్పటికీ, ఈ ఓటమి నిర్ణయాత్మకమైనది. రాజకీయ పునరాగమనాన్ని అత్యంత కష్టతరం చేస్తుంది. బహుశా మమతా బెనర్జీకి అతిపెద్ద సవాలు బీజేపీ ముఖ్యమంత్రి సువేందు అధికారి. ఆయన ఒకప్పుడు రెండు దశాబ్దాలకుపైగా ఆమెకు సన్నిహితుడు, బలమైన క్షేత్రస్థాయి సంబంధాలున్న రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. అధికారికి బెంగాల్ రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. అనేక విధాలుగా, ఆయనను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో పోల్చవచ్చు. ఆయనకు రాజకీయ చతురత ఉంది. ఇటీవలి నెలల్లో మమతా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ఆమె మద్దతుదారులను పక్షం మార్చుకునేలా ప్రోత్సహించడానికి కృషి చేశారు. పెద్ద సంఖ్యలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆమెకు దూరమయ్యారని సమాచారం. ఇది అసెంబ్లీలో ఆమె స్థానాన్ని చాలా బలహీనపరిచి, పార్టీపై ఆమె అధికారాన్ని తగ్గించింది. ఒకప్పుడు విధేయులైన మద్దతుదారులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు కూడా పార్టీని వీడటం ప్రారంభించారు. ఈ నాయకులలో కొందరు సంవత్సరాల తరబడి మమతా బెనర్జీకి అండగా నిలిచారు, కానీ ఇప్పుడు వేరే రాజకీయ మార్గాలను ఎంచుకున్నారు. పార్టీ నుంచి ముఖ్యమైన రాజకీయ అవకాశాలు పొందిన సుష్మితా దేవ్ నిష్క్రమణ చాలా పెద్ద మార్పు. ఆమె రాజీనామా తృణమూల్ కాంగ్రెస్ నుంచి పెరుగుతున్న వలసలకు ప్రతీకగా నిలిచింది. మమతా బెనర్జీని వీడే ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆమె జెండా కింద ఎన్నికయ్యారు కాబట్టి రాజీనామా చేయాలని చాలా మంది వ్యాఖ్యాతలు వాదిస్తారు. అయితే, ఈ వ్యక్తులు వారి సొంత బలాలు, ప్రజాదరణ కారణంగా ఎంపికయ్యారని కూడా వాదించవచ్చు. ఉదాహరణకు, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు స్వతంత్రంగా ఓట్లను ఆకర్షించగలరనే కారణంతో అభ్యర్థులుగా ఎంపికయ్యారు. అందువల్ల, వారి విజయం కేవలం మమతా బెనర్జీ వల్లే సాధ్యమైందని చెప్పడం పూర్తిగా సరైనది కాదు. 2011 నుంచి, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లోని కాంగ్రెస్, వామపక్ష పార్టీలను క్రమపద్ధతిలో బలహీనపరిచి, వారి రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించారు. అయినప్పటికీ, ఓటమి తర్వాత, ఆమె మద్దతు, రక్షణ కోరుతూ అవే పార్టీల వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. చాలా మంది పరిశీలకులకు, ఇది భయాందోళనను, రాజకీయ విశ్వాసం కోల్పోవడాన్ని సూచించింది. రాజకీయాలు చాలా క్రూరంగా ఉంటాయి. ప్రతీకారం తీర్చుకోవాలనుకునేది శత్రువులు మాత్రమే కాదు. ఒకప్పుడు నిర్లక్ష్యం చేసిన లేదా అవమానాలకు గురైన మాజీ మిత్రులు కూడా పాత లెక్కలు తేల్చుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఓటమి ఒక రాజకీయ నాయకుడిలో భయాందోళన కలిగించకూడదు. అయినప్పటికీ, మమతా బెనర్జీ ఇప్పుడు బలం కన్నా భయంతోనే పనిచేస్తున్నారని చాలామంది నమ్ముతున్నారు. ఆమె ప్రత్యర్థులు ఆమె మద్దతుదారులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుండగా, మాజీ మిత్రులు ఆమె అవమానాన్ని ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తున్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు మెరుగైన సలహాదారులు అవసరమయ్యారు. నేడు, రాజకీయ ప్రతికూలతను ఎదుర్కొంటున్న నాయకురాలిగా, ఆమెకు గతంలో కంటే మెరుగైన సలహాదారులు అవసరమని చెప్పవచ్చు. భవిష్యత్తును అంచనా వేయడం ఎల్లప్పుడూ కష్టం. అయినప్పటికీ, పావెల్ ఫేమస్ కామెట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులను వెంటాడుతూనే ఉంది: "అన్ని రాజకీయ జీవితాలు వైఫల్యంతోనే ముగుస్తాయి." చరిత్రను పరిశీలిస్తే, అత్యంత శక్తివంతమైన రాజకీయ నాయకులు కూడా చివరికి ఓటమిని చవిచూస్తారని తెలుస్తుంది. చాలామంది తమ చివరి కాలంలో రాజకీయ వైభవానికి చాలా దూరంగా ఉంటారు. మమతా బెనర్జీ తన తలరాతను మార్చుకోగలరా లేదా అనేది అనిశ్చితంగానే ఉంది, కానీ ప్రస్తుతం ఆమె రాజకీయ ప్రయాణం అత్యంత క్లిష్టమైన దశలోకి ప్రవేశిస్తున్నట్లు కనిపిస్తోంది.

## సీఎం పర్యటనతో ఉప్పల్ కు ఒరిగిందేమిటి బీజేపీ ప్రజా పోరు దీక్ష

మేడ్చల్ : ఉప్పల్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ప్రజల సమస్యలపై ఎలాంటి స్పష్టమైన హామీలు ఇవ్వలేదని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు "ప్రజల కోసం ? ప్రగతి కోసం" ప్రజా పోరు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటు, డ్రైనేజ్ ఆధునీకరణ, ఉప్పల్ భాగాయత్ భూ యజమానుల సమస్యల పరిష్కారం, బస్ టెర్మినల్ నిర్మాణం, మంచినీటి సరఫరా, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి కీలక అంశాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అలాగే చర్లపల్లి రైల్వే టెర్మినల్ అప్రోచ్ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉప్పల్ అభివృద్ధి కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## కలెక్టరేట్ ఎదుట సిపిఐ ధర్నా

మేడ్చల్ : మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ నేతలు ధర్నా నిర్వహించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయినా సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. పెరుగుతున్న ధరల భారం కారణంగా మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## భార్యను అనుమానంతో కాల్చి చంపిన భర్త

మల్కాజిగిరి : మల్కాజిగిరిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో భర్త రివాల్వర్‌తో కాల్పులు జరిపి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతురాలు నిషా రాణిగా గుర్తించారు. నిందితుడు అరుణ్ గతంలో అక్రమంగా రివాల్వర్ కలిగి ఉన్న కేసులో అరెస్టై జైలు శిక్ష అనుభవించి, ఇటీవలే బెయిల్‌పై విడుదలైనట్లు సమాచారం. తన మొదటి భార్యకు విడాకులు ఇచ్చిన అరుణ్, ఆమె సొంత చెల్లెలైన నిషా రాణిని ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. అయితే కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న అతడు, అదే కారణంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య అనంతరం పరారీలో ఉన్న నిందితుడి కోసం మల్కాజిగిరి పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గంజాయి క్వీన్ మళ్లీ తప్పించుకుంది...

**హైదరాబాద్, జూన్ 11:** తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూబాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూబాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతంలో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది. గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాంగూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది. ధూల్‌పేట్ నుంచి మకాం మార్చేసి.. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే ప్రాంతంలో తన అడ్డాను ఏర్పాటు



చేసుకున్న నీతూబాయి.. కిరాణా షాపు ముసుగులో భారీగా గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ దాడుల్లో గుర్తించారు. నిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన గంజాయి విక్రయాలను నీతూబాయి కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. అయితే నీతూబాయిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి.. ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. జైలుకు వెళ్లి బయటికి వచ్చిన నీతూబాయి.. మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. ఈ డ్రగ్ డాన్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ అన్ని చర్యలు చేపట్టింది. ఒకప్పుడు సాధారణ గృహిణిగా ఉన్న నీతూబాయి స్వస్థలం ధూల్‌పేట్. ఆమె కుటుంబం మొత్తం గుడుంబా దందా చేసేది. అయితే ఆబ్కారీ శాఖ రాష్ట్రంలో గుడుంబా తయారీ, విక్రయాలపై పూర్తిగా నిషేధించడంతో వారు గంజాయి దందా మొదలుపెట్టారు. తమ బంధువులు అంతా ధూల్‌పేటను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తుండగా.. నీతూబాయి మాత్రం నానక్‌రాంగూడలోని లోధా బస్తీకి మకాం మార్చింది. 2023లో నీతూబాయి పోలీసులకు పట్టుబడినప్పుడు గంజాయి అమ్మకాలతో రూ.4 కోట్ల స్థిర, చరాస్తులను కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వాటిని జప్తు చేశారు.

# కోలివింగ్ హాస్టల్స్ లో ఏం జరుగుతోంది...

**హైదరాబాద్, జూన్ 11 :** హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్థలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు. కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలంటే.. ఒక హై లెవల్ కమిటీ ద్వారా సమగ్రంగా విచారణ చేయించి.. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో వీహెచ్ చేసిన సూచనపై ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నెటిజన్లు సూచిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఓ కో లివింగ్ హాస్టల్‌పై నుంచి ఒక యువతి దూకి ప్రాణాలు తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రియుడి వేధింపులను తట్టుకోలని ప్రియురాలు.. అదే కో లివింగ్ హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కూడా గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండే యువతీయువకులు చేసే పనులతో పరిసరాల్లో ఉండే నగరవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నామినేటెడ్ రెన్యువల్స్ కష్టమే...

**వరంగల్, జూన్ 11 :** ఒక్కొక్కటి రెన్యువల్ అవుతున్నాయి..! మరి మా సంగతి ఏంటి..? వాళ్ళకే అవుతాయా మాక్కూడా రెన్యువల్ చేయండి ప్లీజ్..అంటూ నేతల ముందు అప్పీల్ చేస్తున్నారు. ఇంతకి అయ్యేది ఎందరికి? హ్యాండ్ ఇచ్చేది ఎవరికి..!? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 37 మంది నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. 2023 ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వాళ్లు కొందరు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఇంకొందరు ఆ లిస్ట్‌లో ఉన్నారు. వాళ్ళ పదవీకాలం జులైతో ముగుస్తుంది. అదే సమయంలో కొత్తగా పదవుల కోసం చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జూన్ వచ్చేసింది? ఇక జులై వచ్చేస్తుంది? అంటూ రోజులు లెక్కబెట్టుకుంటున్నారు. సరిగ్గా ఇక్కడే తేడా కొడుతోందట. పదవుల కోసం కొత్తగా ఎదురుచూస్తున్న వాళ్ళు ఎంత ఆశతో ఉన్నారో? ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఉన్న నాయకులు కూడా అంతే ఆశతో రెన్యువల్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు 37 మంది కార్పొరేషన్ చైర్మన్స్ పని తీరుపై సీఎం రేవంత్ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ చాలా మంది పని తీరు మెరుగు పరుచుకోలేదన్న అభిప్రాయం ఉంది. పైగా వాళ్ళు ఎవరూ పార్టీ కోసం సరిగా సమయం ఇవ్వడం లేదన్న నివేదికలు సైతం సీఎం దగ్గర ఉన్నాయట. రెన్యువల్ అయ్యే వాళ్ళ సంఖ్య చాలా తక్కువ అనే భావన కూడా ఉంది. ఐతే ఇటీవల టీశాట్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవుల్ని రెన్యువల్ చేసింది ప్రభుత్వం. దీంతో? మిగతా వాళ్ళలో కొందరు ?మా పదవులు మాత్రం ఎందుకు రెన్యువల్ కావన్న ధీమాతో ఉన్నట్టు తెలుస్తోంది. మరికొందరైతే? టెన్షన్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఏ లెక్కన చూసుకున్నా? ఇప్పుడున్న 37మందిలో మెజార్టీ నాయకులకైతే రెన్యువల్ ఉండకపోవచ్చనే తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని టీజీఐఐసీ చైర్మన్‌గా కొనసాగించే అవకాశం ఉంది. అలాగే?. స్పోర్ట్స్ అథారిటీ, ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ చైర్మన్ లాంటి కొన్ని పదవులకు మాత్రం రెన్యువల్స్ ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వాళ్లలో 16 మందికి ఇంటెలిజెన్స్ అధికారుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయని, సదరు చైర్మన్స్ రెజుమేస్‌ను తిరిగి అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. రేవంత్ సీఎం అయినప్పటి నుండి.. పదవులు ఇచ్చే ప్రతిఒక్కరి విషయంలో పోలీసు విచారణ చేయిస్తున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు కూడా అదే పంథా ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. కొందరు కార్పొరేషన్ చైర్మన్ ల మీద ఆరోపణలు వచ్చిన క్రమంలో ఫ్రెష్ గా నివేదిక కోరినట్టు తెలుస్తోంది. ఏదేమైనా రెన్యువల్ కి సమయం దగ్గర పడుతుండటంతో చాలా మందిలో ఐతే టెన్షన్ మొదలైందని అంటున్నారు. మళ్ళీ ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ.. నేతల వద్దకు క్యూ కడుతున్నారు. వీరికి తోడు.. కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు కూడా ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారు.

# బొగ్గు నుంచి గ్యాస్...

**ముంబై,జూన్ 11:** భారతదేశం ఇంధన దిగుమతులపై ఎంతగా ఆధారపడి ఉందో ఇటీవలి ఘటనలు మరోసారి ఉద్ఘాటించాయి. ఎల్ఎన్‌జీలో 42 శాతం ఖతార్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే తాజాగా పశ్చిమాసియా యుద్ధం కారణంగా అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడిచేశాయి. ఇరాన్ గల్ఫ్ దేశమైన ఖతార్‌పై దాడిచేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తడంతో భారత్‌కు ఎల్ఎన్‌జీ సరఫరా 30 శాతం పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 17 శాతం గ్యాస్ సరఫరా తగ్గడం కేవలం భారత్ సమస్య మాత్రమే కాదు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్ స్థిరత్వానికి కూడా హెచ్చరిక. కేంద్ర ప్రభుత్వం ఎల్ఎన్‌జీ కొరత తీర్చడానికి కీలక నిర్ణయం తీసుకుంది. 37,500 కోట్ల రూపాయలతో కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుకు చేపట్టిన నిర్ణయం సమయోచితం మాత్రమే కాదు, దూరదృష్టి కలిగిన వ్యూహాత్మక చర్య. బొగ్గు నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసే ఈ సాంకేతికత ద్వారా దేశం దీర్ఘకాలికంగా విదేశీ ఆధారాలను తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. ఖతార్, దుబాయ్ వంటి దేశాలపై ఎల్ఎన్‌జీ కోసం అత్యధికంగా ఆధారపడటం భారత్ శక్తి భద్రతకు పెద్ద ముప్పు. భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ఎప్పుడు ఏ రూపంలో మన సరఫరా గొలుసును దెబ్బతీస్తాయో చెప్పలేం. గతంలో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం కూడా ఇంధన ధరలను పెంచి భారత్‌ను ఇబ్బంది పెట్టింది. ఇలాంటి సందర్భాల్లో స్థానిక ఉత్పాదకతను పెంచకపోతే, ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం భారత్ చరిత్రలో మొదటి సారి ఇంత పెద్ద స్థాయిలో చేపట్టిన ప్రయత్నం. దేశంలో సమృద్ధిగా ఉన్న బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, సింథటిక్ గ్యాస్ ఉత్పత్తి చేయడం ద్వారా దిగుమతులు తగ్గించి, విదేశీ మారక నిల్వలను కాపాడవచ్చు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఖతార్‌పై మాత్రమే కాక, మొత్తం ఇంధన దిగుమతులపై ఆధారం తగ్గుతుంది. ఉపాధి అవకాశాలు పెరగడం, బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల అభివృద్ధి, శక్తి భద్రత వంటి బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇది ప్రపంచానికి ఒక మార్గదర్శకంగా నిలవవచ్చు. ఖతార్ వంటి దేశాలపై ఆధారపడిన అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇలాంటి మార్గాలు అన్వేషించేలా చేస్తుంది.

# కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ఘనంగా మండల పూజ





**కుషాయిగూడ, జూన్ 11:** కుషాయిగూడలోని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో మండల పూజా మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భారీ హనుమాన్ విగ్రహ ఆవిష్కరణతో పాటు మూలవిరాట్ శ్రీ కార్యసిద్ధి హనుమాన్ స్వామి, శ్రీ మహా గణపతి స్వామి విగ్రహాల ప్రతిష్ఠకు 41 రోజులు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హంపి పీఠాధిపతి, పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ జగద్గురువులు విద్యారణ్య భారతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు ఔషధీయ మహా అభిషేకం, అఖండ హోమం, ఆలయ సంప్రోక్షణ, భారీ హనుమాన్ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 159 దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన బ్రహ్మశ్రీ శివ కార్తిక్ శాస్త్రి మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధికి 'ప్రణాళిక (planning), కార్యక్రమం (program), నియంత్రణ (control)µ అనే మూడు సూత్రాలు అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రణాళికతో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, కార్యక్రమాల ద్వారా ధార్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, నియంత్రణ ద్వారా ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ మూడు సూత్రాల సమన్వయంతో దేవాలయం సమాజానికి ఆదర్శంగా నిలిచి, భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం జగద్గురువులు భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు చల్లా ప్రభాకర్, యావపురం రవి, పనగట్ల చక్రపాణి గౌడ్, అనిల్ బాబు, రేగొండ వెంకటేశ్వర్లు, సీతారామ శర్మ, నాలచర్ల జనార్ధన్, దయానంద్, పిట్ల రాజు, చల్లా వెంకటేష్, యాదగిరి, బాల్ నరసింహ, శ్రీశైలం, లక్ష్మణ్, రాములు, సుభాష్, అనిల్, రాకేష్, భరత్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం



**కాప్రా జూన్ 21:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు శ్రీమతి రోహిణి (40), సాయినగర్ కాలనీ, కుషాయిగూడ నివాసి. ఆమె తండ్రి జగన్నాథ్ (70) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. తేదీ 07.06.2026 న మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో ఆయన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితుల వద్ద గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. గతంలో కూడా ఆగస్టు–2025లో ఇదే విధంగా ఇంటి నుండి వెళ్లిపోగా, కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు ఆయనను కోల్‌కతాలో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రస్తుతం మరోసారి ఇంటి నుండి వెళ్లిపోయిన నేపథ్యంలో కుమార్తె రోహిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# జవహర్ నగర్ మున్సిపాలిటీలో 'చెత్త' తిప్పలు:

## కనీసం డబ్బాలు కూడా లేక స్థానికుల తీవ్ర ఇబ్బందులు

### - వీధుల్లోనే పేరుకుపోతున్న వ్యర్థాలు.. తీవ్ర ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు

### - పన్నులు కట్టడంలో ముందు.. చెత్త డబ్బాలు పెట్టడంలో వెనక!

**జవహర్ నగర్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా): తెలంగాణ షాన్, జూన్ 11:** ఒకవైపు నగరాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామని అధికారులు ప్రకటనలు గుప్పిస్తుంటే.. మరోవైపు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కార్పొరేషన్ వ్యాప్తంగా కనీసం చెత్త డబ్బాలు (డస్ట్‌బిన్లు) కూడా లేని దుస్థితి నెలకొనడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను ఎక్కడ వేయాలో తెలియక కాలనీవాసులు సతమతమవుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత కాలనీల్లో సైతం చెత్త డబ్బాలు అందుబాటులో లేకపోవడంతో, ప్రజలు నిస్సహాయ స్థితిలో ఖాళీ ప్లాట్లు, రోడ్ల పక్కనే చెత్తను పారబోస్తున్నారు. దీంతో కాలనీలన్నీ డంపింగ్ యార్డులను తలపిస్తూ ఎండ తీవ్రతకు కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి, కాలనీవాసులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోలు సక్రమంగా రాకపోవడం, వచ్చినా సకాలంలో చెత్తను సేకరించకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. వీధుల్లో కమ్యూనిటీ చెత్త డబ్బాలు ఉంటే అత్యవసర సమయాల్లో వాటిలో వేసే వీలుంటుందని, కానీ ఇక్కడ ఆ కనీస సౌకర్యం కూడా కరువైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తీవ్రమైన పారిశుధ్య సమస్యపై జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తక్షణమే స్పందించి పరిష్కరించాలని స్థానిక కాలనీల సంక్షేమ సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేషన్‌గా మారినా తమ కాలనీల్లో కనీస వసతులు కరువయ్యాయని, ప్రతి కాలనీలో, ప్రధాన కూడళ్లలో తక్షణమే మున్సిపల్ చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే పారిశుధ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# పాకిస్తాన్ కు నీటి కష్టాలు...

**శ్రీనగర్, జూన్ 11 :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ విషయంలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది. దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. దశాబ్దాల నాటి సిందూ జల ఒప్పందాన్ని హోల్డ్‌లో పెట్టింది. తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. రక్తం నీరు ఏకకాలంలో పారవని స్పష్టం చేసింది. దీంతో సింధూ జలాలు రాక పాకిస్తాన్‌లో కరువు చాయలు, ఆకస్మిక వరదలు వస్తున్నాయి. ఒప్పందం పునరుద్ధరణకు పాకిస్తాన్ అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు. తాజాగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్. పాటిల్ సింధు జలాల విషయంలో భారత్ కఠిన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింధు నదీ వ్యవస్థ నుంచి పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. 'సింధు జలాల ఒప్పందం రద్దు చేయలేదు. ఇంకా అమలులోనే ఉంది. కానీ తాత్కాలికంగా నిలిపివేశాం. సరిహద్దు గుండా నీళ్లు వెళ్లకుండా ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సీఆర్. పాటిల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు హోం మంత్రి అమిత్ షా ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు1960 సింధు జలాల ఒప్పందం ప్రస్తుతం హోల్డ్‌లో ఉంది. భారత్ ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, పాకిస్తాన్‌కు నీరు అందకుండా చేసేందుకు సాంకేతిక, ఇంజనీరింగ్ చర్యలు తీసుకోవడం ద్వారా ఒప్పంద స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఇటీవలి సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో భారత్ సింధు జలాలను ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. నీటిని భారత్ సొంత అవసరాల కోసం వినియోగించుకోవాలి అన్న ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలను అమలుకు చర్యలు చేపట్టారు. సింధూ జలాలను కేంద్రం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు మళ్లించాలని భావిస్తోంది. దీంతో ఆ రాష్ట్రాలకు అదనపు నీటి వనరులు లభించే అవకాశం ఉంది. శత్రు దేశానికి నీటిని వెళ్లకుండా చేయడమే లక్ష్యంగా ఇప్పటికే సింధూ, దాని ఉప నదులపై బ్యారేజీలు నిర్మిస్తోంది. అధిక వర్షాలు ఉంటే గేట్లు ఎత్తి పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సృష్టిస్తోంది. భారత్?పాకిస్థాన్ మధ్య నీటి వివాదంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఒప్పందం నిలిపివేతను ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా భారత్ తన నీటి సార్వభౌమత్వాన్ని బలపరచుకోవాలని చూస్తోంది. ఈ అంశం రాబోయే రోజుల్లో ద్విపాక్షిక సంబంధాలపై ఎంత ప్రభావం చూపించనుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# అమిత్ షా కామెంట్స్ వెనుక కారణం అదేనా

## తెలంగాణ, పంజాబ్‌పై ప్రత్యేక వ్యూహం



**హైదరాబాద్, జూన్ 11 :** దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ.. ఉత్తర భారత దేశంలో ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లో పట్టు సాధించింది. ఈశాన్య రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ ఒక్కటే కాంగ్రెస్ చేతిలో ఉంది. తాజాగా బెంగాల్‌లోనూ బీజేపీ పాగా వేసింది. ఇక ఇప్పుడు బీజేపీ దక్షిణాదిపై ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 2028లో జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాజకీయాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇకపై ఏ రాష్ట్రంలోనైనా ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ, పంజాబ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిగా పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే బీజేపీ వ్యూహం రూపొందిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అమిత్‌షా తెలిపారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ రాజకీయ వ్యూహంలో ముఖ్యమైన మలుపును సూచిస్తున్నాయి. గతంలో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పొత్తుల ద్వారా అడుగుపెట్టిన బీజేపీ, ఇప్పుడు ఒంటరి బలంపై మరింత విశ్వాసం పెంచుకుంది. ఇది పార్టీ తన సొంత ఆధారాలను విస్తరించాలని, స్వతంత్రంగా అధికారం సాధించాలని భావిస్తోందని తెలియజేస్తోంది. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్, ఏఐఎంఐఎం వంటి ప్రాంతీయ పార్టీలు కూడా బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పొత్తులు తిరస్కరించడం రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై కీలక ప్రకటనఅమిత్ షా మరో ముఖ్యమైన విషయం చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేస్తామని. ఇది బీజేపీ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన యూనిఫామ్ సివిల్ కోడ్‌ను దక్షిణాది రాష్ట్రాలకు కూడా విస్తరించాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం ద్వారా పార్టీ తన విజన్‌ను స్పష్టం చేస్తోంది. ఒంటరి పోటీ ప్రకటన తెలంగాణ రాజకీయ దృక్పథాన్ని మార్చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. పొత్తు ఆశల్లో ఉన్న చిన్న పార్టీలకు ఇది ఎదురుదెబ్బ కావచ్చు. బీజేపీ తన సొంత ఓటు బ్యాంకును విస్తరించి, స్వతంత్ర శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలం పెంచుకోవాలన్న బీజేపీ లక్ష్యం స్పష్టమవుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యూహం కావచ్చు. పంజాబ్‌తోపాటు తెలంగాణను కూడా ఒంటరి పోటీ మోడల్‌గా తీసుకురావడం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా తన సానుకూలతను మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అమిత్ షా వ్యాఖ్యలు కేవలం తెలంగాణకు మాత్రమే కాకుండా, బీజేపీ జాతీయ స్థాయి రాజకీయ వ్యూహంలోని ముఖ్యమైన మార్పును తెలియజేస్తున్నాయి. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో అధికారం సాధించాలన్న లక్ష్యం దక్షిణ భారతదేశంలో పార్టీ విస్తరణకు కీలకమవుతుంది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# బండికి బ్రేకులు..



**కరీంనగర్, జూన్ 11 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? ఈసారి ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదా? గత ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్స్ గెలుపులో కీలకంగా వ్యవహరించారని పేరున్న బండి ఇప్పుడెందుకు దూరం అవుతారు? పార్టీలో అసలా చర్చ ఎందుకు జరుగుతోంది? అది బండి వ్యక్తిగతమా లేక పార్టీ నిర్ణయమా? తెలంగాణలో పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్స్‌కు, గత ఎన్నికల టైంలో వివిధ కారణాలతో ఆగిన మరికొన్ని మున్సిపాలిటీలకు త్వరలోనే ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఆ దిశగా కమలం పార్టీ కూడా గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్‌లు, వరంగల్ , ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. గత ఎన్నికలలో బీజేపీ గ్రేటర్ పరిధిలో, వరంగల్‌లో చెప్పుకోతగ్గ సీట్లే గెలుచుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎవరూ ఊహించనన్ని సీట్లు సాధించింది. అప్పట్లో పార్టీ ఆ స్థాయిలో పనితీరు కనబరచడానికి కారణం నాడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేసిన ప్రచారం ఆయన ప్రసంగాలేనన్న అభిప్రాయం స్థానిక కేడర్‌లో ఉంది. బండి పార్టీలో జోష్ తీసుకురావడంతోపాటు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించగలిగారన్నది వాళ్ల మాట. ఆ తర్వాత జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ మంచి పెర్ఫార్మెన్స్ చూపించింది. అది కూడా బండి సంజయ్ వల్లనే అనే మాట పార్టీలో ఉంది. మళ్ళీ ఇప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో బండి సంజయ్ రోల్ ఏంటన్న చర్చ మొదలైంది. ఆ మధ్య జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను గెల్చుకుంది బీజేపీ. నెక్స్ట్ మా టార్గెట్ జీహెచ్‌ఎంసీ అని అప్పుడే అన్నారు బండి సంజయ్. కానీ? ఇప్పుడు మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆయన ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత ఎన్నికల టైమ్‌లో బండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు కాబట్టి? అంతటా తిరిగే అవకాశం ఉండేది. కానీ? ఇప్పుడు ఆ ఛాన్స్‌లేదు. పైగా గ్రేటర్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు ఈ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కలన్నిటినీ చూసుకుంటే?. ఈసారి బండి సంజయ్ ఇక్కడ ప్రచారం చేయకపోవచ్చన్న అంచనాలున్నాయి. అలాగే ఇక్కడి నేతలు కొందరికి, ఆయనకు మధ్య గ్యాప్ కూడా ఉందని చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల కారణాలతో బండి సంజయ్ కూడా వ్యక్తిగతంగా గ్రేటర్‌లో ప్రచారంపై ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అయితే హైదరాబాద్‌ని వదిలేసినా వరంగల్‌లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలకు కూడా ఇదే విషయం చెప్పినట్టు తెలిసింది. వరంగల్ ఇన్చార్జ్‌గా తీసుకొని పని చేస్తే తృప్తి అయినా ఉంటుందని కేంద్ర మంత్రి భావిస్తున్నట్టు సమాచారం. దీంతో పార్టీ పెద్దలు ఆయనకు ఎక్కడ బాధ్యతలు అప్పగిస్తారోనని ఆసక్తిగా చూస్తోంది కేడర్.

# దడ పుట్టించిన తొలి వర్షం...

**హైదరాబాద్, జూన్ 11 :** హైదరాబాద్ నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన భాగ్యనగరానికి తొలకరి పలకరింపు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని భావించినప్పటికీ.. ఈ వాన మాత్రం సున్నితంగా, ఆనందంగా డాన్సులు వేసేలా లేదు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఉగ్రరూపం దాల్చి నగరవాసులను ఒక్కసారిగా దడదడలాడించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా అంధకారమయమై, ఒక భారీ ఉరుముల, మెరుపుల వర్షం నగరంలోకి ప్రవేశించడంతో వాతావరణం క్షణాల్లో మారిపోయింది. వాతావరణ పరిశీలకుల హెచ్చరికల ప్రకారం.. అమీన్‌పూర్, పటాన్‌చెరు, బాచుపల్లి మీదుగా అంచెలంచెలుగా విస్తరించిన ఈ భారీ మేఘాల గుంపు, గంటల వ్యవధిలోనే హైదరాబాద్ మహా నగరాన్ని పూర్తిగా చుట్టేసింది. పశ్చిమ, మధ్య హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌తో పాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉరుముల గర్జనలతో కూడిన కుండపోత వాన కురిసింది. కేవలం గంట వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 40 మి.మీ నుండి 50 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావడంతో.. నగర రహదారులు చూస్తుండగానే చెరువులను తలపించాయి. కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమైన వేలాది మంది ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఈ ఆకస్మిక వాన దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి రద్దీ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీరు, లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన రహదారుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వానకు తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం సమస్య తీవ్రతను మరింత



పెంచిందినగరంలో తలెత్తిన ఈ ట్రాఫిక్ గందరగోళాన్ని చక్కదిద్దడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. వాహనదారులకు సోషల్ మీడియా ద్వారా నిరంతరం అలర్ట్‌లు జారీ చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ నగరవాసులకు కొన్ని కీలక సూచనలు చేసింది. వర్షం పడుతున్న సమయంలో రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున వాహనాల వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలి. ముఖ్యంగా బైక్ నడిపేవారు ఓవర్ టేక్‌లు చేయవద్దని, భారీ ఈదురుగాలులు వీస్తున్నందున చెట్ల కింద, పాత గోడల పక్కన వాహనాలను ఆపకూడదు అని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలపడనున్నందున ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

# వైసీపీ కాపు రాజకీయం...



**కాకినాడ, జూన్ 11 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2029 ఎన్నికల లక్ష్యంగా చాలా రకాల వ్యూహాలు పన్నుతోంది. అందులో భాగంగా పార్టీ జనసేన పై ఫుల్ ఫోకస్ పెట్టింది. జనసేన ను దారుణంగా దెబ్బతీయాలని చూస్తోంది. కాపులను జనసేనకు దూరం చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని.. అదే జరిగితే ఇతర పక్షాల మద్దతుతో చాలా సులువుగా అధికారంలోకి రావచ్చని అంచనా వేస్తోంది. అయితే అది అంత తేలికైన విషయం మాత్రం కాదు. ముఖ్యంగా జనసేన నుంచి కాపులను ఇప్పట్లో వేరు చేయడం కుదిరే పని కాదు. ఎందుకంటే కాపులు పవన్ కళ్యాణ్ విషయంలో కొంత సంతృప్తితో అయితే మాత్రం ఉన్నారు. తమ వాడు డిప్యూటీ సీఎం పదవి వరకు వచ్చాడు అని.. ఏపీలో పాలనలో భాగస్వామ్యం అవుతున్నాడని.. ఆయన నిర్ణయాలకు గౌరవం లభిస్తుందని వారిలో సంతృప్తి ఉంది. అయినా సరే కాపులను విభజిస్తే తప్ప రాజకీయాలు చేయలేమని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. కాపుల మద్దతు కోసం ఒకవైపు.. జనసేనకు దూరం చేసేందుకు మరోవైపు జగన్ చేయని ప్రయత్నం అంటూ లేదు.ప్రస్తుతం కాపులు పవన్ కళ్యాణ్ వెంట ఉన్నారు. కాపు నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కురసాల కన్నబాబు.. ఇలా పేరు మోసిన నేతలంతా జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అయితే వీరి ద్వారా కాపులను ఆకర్షించే ప్రయత్నం చేయడం లేదు జగన్మోహన్ రెడ్డి. ఎందుకంటే వీరు ఆకర్షించే స్థితిలో లేరు. ఎంతవరకు పవన్ పై విమర్శలు చేయగలరే తప్పించి.. వీరికి మరో పని చేతకాదు. పోనీ ముద్రగడ పద్మనాభం, హరి రామ జోగయ్య లాంటి వారిని తిరిగి ప్రయోగిస్తామంటే కాపులు మరింతగా తిరస్కరిస్తారు. ఈ విషయం జగన్మోహన్ రెడ్డికి తెలుసు కూడా. అందుకే కొత్త కాపుల కోసం ఆయన అన్వేషిస్తున్నారు. అందుకే దాసరి రాము, వంగవీటి కుటుంబం వంటి వారిపై ఆశలు పెట్టుకున్నారు.పవన్ కళ్యాణ్ టిడిపి తో పొత్తు పెట్టుకోకుండా హరిరామ జోగయ్య పేరు చెప్పుకొని చాలా ప్రయత్నాలు చేశారు అప్పట్లో. ఒకవేళ పొత్తు పెట్టుకున్న సగానికి పైగా సీట్లు కావాలని కోరారు. పవన్ కళ్యాణ్ ను కోరమని చెప్పారు. లేకుంటే పొత్తు వద్దు అని తేల్చేయమని సలహా ఇచ్చారు. ఎప్పటికప్పుడు హరి రామ జోగయ్య పేరుతో లేఖలు రాసి పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి చేసే ప్రయత్నం చేశారు. ముద్రగడ పద్మనాభం అయితే జనసేనలోకి వచ్చి.. తనదైన వైసీపీ ప్రయోజనాల కోసం కృషి చేయాలని చూశారు. దానిని ముందుగానే గ్రహించారు పవన్ కళ్యాణ్. అందుకే జనసేనలోకి ముద్రగడ ఎంట్రీని లేకుండా చేశారు. ఆ కోపంతోనే ముద్రగడ వైసీపీలోకి వెళ్లారు. పవన్ ను ఓడిస్తానని శపథం చేశారు. ఓడించలేక పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకున్నారు.జగన్మోహన్ రెడ్డి ముందుగా హరి రామ జోగయ్యను వాడేసారు. తరువాత ముద్రగడ పద్మనాభంను వాడేసారు. ఇప్పుడు కొత్తగా వాడేందుకు దాసరి రాము కనిపిస్తున్నారు. అవసరం అనుకుంటే వంగవీటి కుటుంబంలో ఒకరిని తెచ్చి కాపు రాజకీయంతో కాక రేపాలని చూస్తున్నారు. కానీ వారు ముందుకు వస్తారా లేదా అన్నది చూడాలి.

# యాక్టివ్ పాలిటిక్స్ కు మల్లారెడ్డి దూరం



**రంగారెడ్డి, జూన్ 11 :** తెలంగాణ రాజకీయా ల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న మాజీ మంత్రి, మేడ్చ ల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి (బి ఆర్ ఎస్) ఎన్నికల్లో పో టీ చేయవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బి ఆర్ ఎస్ అ ధిష్టానం టికెట్ ఇస్తే తన పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డిని బరిలోకి దింపాలని భావిస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి బిజెపిలో చేరుతారని ఇటీవల సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.ఎంపీ తో పాటు 5 ఎమ్మెల్యే టికెట్లు ఆయన కుటుంబ సభ్యులకు ఇవ్వాలని బిజెపి అధిష్టానాన్ని అడుగుతున్నారని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో అనుచరులు కొందరు నేరుగా మల్లారెడ్డిని ఈ విషయమై అడిగారు. తాను పోటీ చేయబోనని, టిఆర్ఎస్ టికెట్ ఇస్తే మహేందర్ రెడ్డి పోటీ చేస్తారని చెప్పారు.అంతేగాక చిన్న కుమారుడు భ ద్రారెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతారని సూటిగా చెప్పకుండా చేరుతారేమోనని అన్నారు. బిజెపిలో చేరబోనని, బి ఆర్ఎస్‌లోనే ఉ ంటానని చెప్పారు. మల్లారెడ్డి కోడలు ప్రీతి రె డ్డికి రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఆమె బిజెపిలో చేరుతారని పార్లమెంటుకు పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మూడు చోట్ల ఇటీవల బి ఆర్ ఎస్ సభ్యత్వ నమోదు, సర్ పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడ్చల్, ఘట్కేసర్ తో పాటు మరోచోట సమావేశాలు జరిగాయి. వీటికి సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానికంగా ఉన్నప్ప టికీ సమావేశాలకు హాజరు కాలేదు. పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా హాజరయ్యారు. స్థానికంగా ఉండి సమావేశాలకు హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. బిజెపిలోకి వెళ్తున్నందున సమావేశాలకు హాజరు కాలేదని ప్రచారం జరిగింది. మల్లారెడ్డి తీరుపై బీఆర్ఎస్ అధిష్టానం అసంతృప్తితో ఉ న్నట్లు తెలిసింది. టిఆర్ఎస్ లో ఉంటూనే కాంగ్రెస్ బిజెపి నేతలను కలిశారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ప్రధాని మోడీని వేసి ఆహ్వానించారు.పార్టీకి సమాచారం లేకుండా కలవడంపై అధిష్టా నం గుర్రుగా ఉంది. బి ఆర్ ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం లో ఈ విషయమై కెసిఆర్ మల్లారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీకి సమాచారం ఇవ్వకుండా సీఎంను కలవడంతో బిఆర్ఎస్కు చెందిన ముఖ్య నాయకులు వివాహ వార్షికోత్సవానికి గైరహాజరయ్యారు. కాంగ్రెస్కు చెందిన డి ప్యూటీ సీఎం, పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ విషయమే అప్పట్లో పెద్ద చర్చ జరిగింది. మల్లారెడ్డి నిర్ణయం వ్యూహాత్మకమా లేక నిజంగానే పోటీ చేయరా అనేది చర్చనీ అంశమైంది. వాస్తవానికి మల్లారెడ్డి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఇంకో టర్మ్ పోటీ చేయగలరు. ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో అనుచరులకు అర్థం కా వడం లేదు. ఆరు నెలల క్రితం తాను పోటీ చేయను అని అ న్నారు. ఆ తర్వాత మళ్లీ నేను అలా అనలేదు అంటూ మాట మార్చారు. ఇప్పుడు కూడా మాట మార్చేస్తారా? నిజంగానే పోటీకి దూరంగా ఉంటారో వేచి చూడాల్సిందే

# జనసేన ప్లానింగ్ ఏంటీ




**విజయవాడ, జూన్ 11 :** ఏపీలో కూటమిగా ఏర్పడిన టిడిపి, జనసేన, బిజెపిలు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఈ క్రమంలో కూటమికి నేతృత్వం వహిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్యేలు ఎలా వ్యవహరిస్తున్నారు ఏం చేస్తున్నారు అనే విషయాలపై తరచుగా నివేదికలు తెప్పించుకుంటున్నారు. సర్వేలు కూడా చేయించుకుంటున్నారు. అయితే, మరో కీలక పార్టీగా ఉన్న జనసేన పరిస్థితి ఏంటి అనేది చర్చ నియాంశంగా మారింది.మొత్తం 21 స్థానాల్లో పోటీ చేసిన జనసేన 21 స్థానాల్లో కూడా విజయం దక్కించుకుంది. వీటిలో పిఠాపురం నియోజకవర్గాన్ని పక్కనపెడితే మిగిలిన 20 నియోజకవర్గాల్లో గత రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఏ విధంగా ఉంది.. ఏం చేస్తున్నారు.. అనే అంశాలపై పవన్ కళ్యాణ్ నివేదికలు తెప్పించుకుంటున్నామని చెబుతున్నా.. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా నివేదికలు సమర్పించలేదని తెలిసింది. ఎప్పటికప్పుడు వాయిదా వేయడంతో పాటు నివేదికలకు ఇచ్చే విషయంలో ఎమ్మెల్యేలు తాత్సారం చేస్తున్నారన్నది పార్టీ వర్గాల్లోనే జరుగుతున్న చర్చ.దీనికి ప్రధాన కారణం నియోజకవర్గాల స్థాయిలో దాదాపు అందరు ఎమ్మెల్యేలు కూడా పై స్థాయిలో చెబుతున్న మాటలను దిశానిర్దేశాన్ని పట్టించుకోకపోవడమే కారణం అని తెలుస్తోంది. వాస్తవానికి జనసేన పార్టీలో నాయకులకు కొన్ని సిద్ధాంతాలు నిబద్ధత ఉండాలనేది పవన్ కళ్యాణ్ చెబుతున్న మాట. ఇటీవల కూడా ఆయన పదేపదే ఈ విషయాన్ని చెప్పారు. తద్వారా ప్రజలకు చేరువ కావాలని కూడా సూచించారు. కానీ, 21 నియోజకవర్గాల్లో దాదాపు 16 నియోజకవర్గాల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నది రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.ఈ నేపథ్యంలో జనసేన అధినేత ఎమ్మెల్యేలను అలర్ట్ చేయడంతో పాటు సరైన దిశలో నడిపించాల్సిన అవసరం కూడా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఎన్నికలకు మూడు సంవత్సరాల సమయం ఉంది కదా అని కూర్చుంటే అప్పటికి పరిస్థితి మరింత విషమించే అవకాశం కూడా ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# అడుగుంటున్న భూగర్భ జలాలు..
# నగరంలో 3 శాతం మాత్రమే నీరు

**హైదరాబాద్, జూన్ 11:** హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న వేళ నగరవాసులను ఓ పెను ముప్పు ముంచెత్తబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగుంటుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్మెంట్ రిపోర్ట్ 2025 స్పష్టం చేసింది. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ఆశ్రయమిస్తున్న హైదరాబాద్ నగరంలో రాష్ట్ర మొత్తం భూగర్భ జల వనరుల్లో కేవలం 3 శాతం మాత్రమే లభ్యత ఉండటం గమనార్హం. జనాభా సాంద్రతకు, నీటి లభ్యతకు మధ్య ఉన్న ఈ తేడా నగర జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.కేంద్ర నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున 19.8 లక్షల హెక్టార్ మీటర్ల మేర భూగర్భ జల వనరులు ఉన్నాయి. అయితే.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి వచ్చే గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌కు మాత్రం కేవలం 66 వేల హెక్టార్ మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల సగటును పరిశీలిస్తే.. ప్రతి జిల్లాకు దాదాపు 63 వేల హెక్టార్ మీటర్ల భూగర్భ జలాలు లభిస్తున్నాయి. జనాభా పరంగా ఎంతో చిన్నవైన ఆసిఫాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలు కూడా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం వనరులతో సమానమైన భూగర్భ జల సంపదను కలిగి ఉండటం, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది.ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి లభించే భూగర్భ జలం కేవలం 6,100 హెక్టార్ మీటర్లు మాత్రమే కాగా.. 40 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా తమ గృహ, వాణిజ్య అవసరాల కోసం 2025 సంవత్సరంలోనే అందులోని దాదాపు 99 శాతం నీటిని పూర్తిగా తోడేశారు. దీనివల్ల భూగర్భ జలాలు సహజసిద్ధంగా రీఛార్జ్ అవ్వడానికి అసలు అవకాశమే లేకుండా పోయింది. ఇదే విధమైన ధోరణి పక్కనే ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ కనిపిస్తోంది. అక్కడ లభ్యమయ్యే 9700 హెక్టార్ మీటర్ల జలాల్లో ఇప్పటికే 7700 హెక్టార్ మీటర్ల నీటిని తోడేయడంతో ఆ ప్రాంతం కూడా ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉంది.మహానగరం కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడం, వర్షపు నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే పనితీరు బాగున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో అత్యధిక శాతం భూమి కాంక్రీట్, రోడ్లతో నిండిపోవడం వల్ల వర్షం పడినా నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనికి తోడు హైదరాబాద్‌లోని రాతి భూగర్భ పొరలు, తగ్గిపోతున్న ఖాళీ స్థలాలు సహజ రీఛార్జ్ ప్రక్రియను పూర్తిగా దెబ్బతీశాయని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరవాసులు, ప్రభుత్వం అప్రమత్తమై ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని ఆయన హెచ్చరించారు.

# పార్టీలకతీతంగా భూ దందాలు

**నెల్లూరు, జూన్ 11 :** వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గంలో రకరకాల భూ దందాలు జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఔట్స్ వేశారు. అప్పటి అధికారులను మేనేజ్ చేసుకుని మరికొందరు ప్రభుత్వ, కాలువ భూములను పట్టా భూములుగా చూపించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రధాన అనుచరుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి మీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. ఆయనతో పాటు మరో నలుగురు వేసిన లేఔట్లపై కూడా ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు జరుగుతోంది. అధికారులు లోతుల్లోకి వెళ్ళి దర్యాప్తు చేస్తుండటంతో అక్రమార్కులకు వణుకు పుడుతోందట. ఆ క్రమంలోనే? వాళ్ళు సరికొత్త ఆలోచనలకు పదునుపెట్టే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం కలకలం రేపుతోంది. గత ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి గెలిచాక వైసీపీ హయాంలో వేసిన అక్రమ లేఔట్లపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ఇటీవల ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అది తుది దశకు చేరుకుందనుకుంటున్న సమయంలో దర్యాప్తు అధికారుల మీద దౌర్జన్యాలు జరగడం కలరలం రేపుతోంది. వీటి వెనక స్థానిక టిడిపి నేతలు ఉన్నారన్న మాటలతో ఇంకా షాకవుతున్నారట స్థానికులు. అసలు అక్రమ లేఔట్లపై దర్యాప్తు ప్రారంభించిన విజిలెన్స్ అధికారులకు మొదట రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సహకరించలేదట. రికార్డులు ఇచ్చేందుకు కూడా కింది స్థాయి అధికారులు ఆసక్తి చూపలేదని తెలిసింది.చివరికి కలెక్టర్ ఆదేశాలతో రికార్డులు తెప్పించుకున్న విజిలెన్స్ అధికారులు సుమారు 78 లేఅవుట్లను పరిశీలించారు. ఇందులో చాలావరకు అక్రమాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో బయటపడిందని అంటున్నారు. ముగ్గురు వ్యక్తులు అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు 300 ఎకరాల్లో అక్రమ లేఔట్లు వేసినట్టు ప్రాథమిక అంచనాకి వచ్చారట. ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేశారని.. వాటి విలువ ఇప్పుడు 100 కోట్లకు పైనే ఉంటుందని దర్యాప్తు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో.. దీని నుంచి తప్పించుకునేందుకు అప్పట్లో అక్రమాలకు పాల్పడ్డ వాళ్ళంతా ఇప్పుడు టిడిపి ద్వితీయ శ్రేణి నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారన్న ప్రచారం కావలిలో కాక రేపుతోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల బండారం విజిలెన్స్ ఎంక్వయిరీలో బయటపడుతూ ఉండడంతో ?వాళ్ళంతా ఉలిక్కిపడుతున్నారట. ఎలాగైనా దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ నేతలకు టచ్ లోకి వెళ్లినట్టు చెప్పుకుంటున్నారు. ఆ టచ్చింగ్స్ కారణంగానే?. కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ? విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సొంత పార్టీలోనే మాట్లాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితంగా ఉన్న కీలక నేత ఒకరు.. ఇప్పుడు టిడిపి నేతలకు వెనకుండి గైడ్ చేస్తున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే అక్రమ లేఔట్లకు సంబంధించిన సూత్రధారులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. వారికి సహకరించిన రియలెస్టేట్ బ్రోకర్స్, డాక్యుమెంట్ రైటర్ల వివరాలు సేకరిస్తున్నారట. దొరికిన వాళ్ళ నుంచి స్టేట్మెంట్స్ రికార్డు చేసే కార్యక్రమం కూడా నడుస్తోందని అంటున్నారు.అయితే విజిలెన్స్ విచారణకు సహకరించొద్దంటూ బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌ను కూడా సదరు సదరు కీలక నేతే బెదిరిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. దర్యాప్తు పూర్తి చేసి నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులు గట్టిగా పనిచేస్తుంటే.. అది పూర్తయితే తమపై క్రిమినల్ కేసులు పెట్టే ప్రమాదం ఉందని అక్రమార్కులు భయపడుతున్నారట. అందుకే? ఎంక్వయిరీని ఆలస్యం చేసేందుకు.. స్థానిక ద్వితీయ శ్రేణి టిడిపి నేతలను రెచ్చగొట్టి అధికారుల మీదకు పంపుతున్నారన్నది లోకల్ టాక్. మా లేఔట్స్ మీద విచారణ చేసే అధికారం ఎవరిచ్చారంటూ విజిలెన్స్ అధికారులను బెదిరించడం కూడా టిడిపి ద్వితీయ శ్రేణి నేతల ప్లాన్‌లో భాగమేనని, అక్రమార్కులే తెరవెనుక ఉండి వాళ్లని పురమాయిస్తున్నారన్న ప్రచారం కావలిలో జరుగుతోంది. టీడీపీ నాయకులు దాడి చేసిన వ్యవహారాన్ని ఇప్పటికే విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారట. సదరు నేతపై కేసు నమోదు చేసినప్పటికీ దీనికి సంబంధించి అటు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గానీ.. జిల్లా అధ్యక్షులు, అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గాని నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని సొంత పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇన్ని ఆటంకాల మధ్య అక్రమ లేఔట్స్‌పై విజిలెన్స్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా..? అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతారా అనేది ఉత్కంఠ గా మారింది.

# తీవ్ర స్థాయికి 'మెగా డీఎస్సీ' రాజకీయ పోరు

ఆంధ్రప్రదేశ్‌లో 'మెగా డీఎస్సీ' నియామకాల చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఉపాధ్యాయ నియామకాలు పూర్తయి అభ్యర్థులు విధుల్లో చేరిన తొమ్మిది నెలల తర్వాత, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా ఈ అంశాన్ని తెరపైకి తెచ్చింది. పేపర్ లీకులు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని, అర్హులకు అన్యాయం చేసి ఉద్యోగాలు అమ్ముకున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగింది. అయితే, ఈ రాజకీయ దాడిని అధికార తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటున్న తీరు, క్షేత్రస్థాయిలో అందుతున్న పారదర్శక వివరణలు వైరల్ అవుతున్నాయి. ఉద్యోగ నియామకాలు ముగిసి, విద్యావ్యవస్థ సాఫీగా సాగుతున్న తరుణంలో వైసీపీ ఈ వివాదాన్ని లేపడం వెనుక పక్కా రాజకీయ కార్యాచరణ ఉందనేది స్పష్టమవుతోంది. స్పోర్ట్స్ కోటా కింద 421 పోస్టుల భర్తీలో నిబంధనలు ఉల్లంఘించారని, జీవోలను మార్చడం ద్వారా తప్పుడు సర్టిఫికేట్లు ఉన్నవారికి లబ్ధి చేకూర్చారని మాజీ మంత్రి పేర్ని నాని వంటి సీనియర్ నేతలు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయ ఉ ద్యోగం రాని నిరుద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకుని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచాలనే ఉద్దేశంతోనే ఈ పేపర్ లీక్, అక్రమాల అస్త్రాన్ని ఆ పార్టీ ప్రయోగించిందని భావిస్తున్నారు.సాధారణంగా ఇలాంటి భారీ ఆరోపణలు వచ్చినప్పుడు ప్రభుత్వాలు డిఫెన్స్‌లో పడటం లేదా ఎదురుదాడికి దిగడం చూస్తుంటాం. కానీ, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ విషయంలో వ్యూహాత్మక ఓపికను ప్రదర్శిస్తోంది. స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి, వైసీపీ చేస్తున్న ప్రతి ఆరోపణకూ సుదీర్ఘంగా, ఓపిగ్గా వివరణ ఇచ్చారు. స్పోర్ట్స్ కోటా భర్తీ అంతా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కేటగిరీలు, గైడ్‌లైన్స్ ప్రకారమే జరిగిందని, ఆరోపణలు చేసేవారికి కనీసం అందులోని క్రీడల పేర్లు కూడా తెలియవంటూ సీఎం గట్టి కౌంటర్ ఇచ్చారు. అలాగే విద్యాశాఖ ఉన్నతాధికారులు కూడా ప్రెస్ మీట్లు పెట్టి ప్రతి అంశాన్ని లెక్కలతో సహా నిరూపిస్తున్నారు.వైసీపీ అనుకూల మీడియా , సోషల్ మీడియా హ్యాండిల్స్ ఎక్కడ ఏ అభ్యర్థి పేరుతో తప్పుడు ప్రచారం ప్రారంభించినా, టీడీపీ సోషల్ మీడియా విభాగాలు గంటల వ్యవధిలోనే ఆ అభ్యర్థికి సంబంధించిన హాల్ టికెట్ నంబర్, మెరిట్ మార్కులు, ర్యాంకు వివరాలను ఆధారాలతో సహా ఆన్‌లైన్‌లో పెడుతున్నాయి. మెరిట్ జాబితాలో లేని వారు, క్వాలిఫై కాని వారు కేవలం నిరుద్యోగులను తప్పుదోవ పట్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను డిజిటల్ సాక్ష్యాలతో తిప్పికొడుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీ డేటాను, సెలక్షన్ లిస్టులను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం, ఎవరికి ఏ అనుమానం ఉన్నా వెరిఫై చేసుకునే వీలు కల్పించడంతో సాధారణ అభ్యర్థులకు సైతం వాస్తవాలు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. దీంతో ఒకప్పుడు క్షేత్రస్థాయిలో సంచలనం సృష్టిస్తుందనుకున్న వైసీపీ డీఎస్సీ స్కామ్ వాదన.. డేటా ముందు నిలబడలేక క్రమంగా పస కోల్పోతోంది. ఉపాధ్యాయులుగా ఎంపికైన రూరల్ బ్యాక్‌గ్రౌండ్ అభ్యర్థులు, క్రీడాకారులు కూడా స్వయంగా వీడియోలు విడుదల చేస్తూ.. తాము కష్టపడి మెరిట్ ద్వారానే ఉద్యోగాలు సాధించామని, తమను రాజకీయంలోకి లాగొద్దని అంటున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్‌ను గమనిస్తే, రాజకీయంగా ప్రస్తుతానికి కూటమి ప్రభుత్వానిదే పైచేయిగా కనిపిస్తోంది. వైసీపీ ఆరోపణల తీవ్రతతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసినప్పటికీ, టీడీపీ ప్రభుత్వం ఆవేశం కంటే డేటా ప్రదర్శన మిన్న అనే సూత్రాన్ని నమ్మింది. అయితే, కోర్టుల్లో నడుస్తున్న కొన్ని పిటిషన్లు, విచారణల వల్ల భవిష్యత్తులో ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది చూడాలి. కానీ ప్రస్తుతానికి మాత్రం పారదర్శకత అనే కేడర్ ద్వారా ప్రభుత్వం ఈ పొలిటికల్ దాడిని విజయవంతంగా తిప్పికొట్టిందనే చెప్పవచ్చు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com